విద్యార్థులతో మాట్లాడుతున్న పీవో చిత్రామిశ్రా

ఆశ్రమ పాఠశాలల తనిఖీ

మంగపేట, మార్చి 12: మండలంలోని చుంచుపల్లి గిరిజన బాలికల, బ్రాహ్మణపల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలను మంగళవారం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా తనిఖీ చేశారు. వార్డెన్లకు పలు సూచనలు చేశారు. బ్రాహ్మణపల్లి ఆశ్రమ పాఠశాల సమీపంలో ఉన్న శిథిలమైన భవనాలను కూల్చివేయాలన్నారు. ఖాళీగా ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులను వినియోగంలోకి తేవాలన్నారు. పాఠశాలల సమీపంలో ఉన్న పాత భవనాలు, వాటర్ ట్యాంకుల వివరాలు డీటీడీవో దృష్టికి తీసుకురావాలన్నారు. నిత్యం వంట గదులు, మరుగుదొడ్లు, డార్మెటరీ, తరగతి గదుల పరిశుభ్రత, గదుల్లో ఫ్యాన్‌లు సక్రమంగా తిరిగేలా హెడ్ మాస్టర్లు క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. తాగు నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు.

సమ్మక్క దేవతను దర్శించుకుంటున్న అడిషనల్ కలెక్టర్ మహేందర్ జీ

వనదేవతలను దర్శించుకున్న అడిషనల్ కలెక్టర్

తాడ్వాయి, మార్చి12 : మేడారం సమ్మక్క, సారలమ్మను అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) మహేందర్ జీ మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు పూజారులు, దేవాదాయశాఖ అధికారులు డోలు, వాయిద్యాలతో స్వాగతం పలికి తల్లుల గద్దెల వద్దకు తీసుకువెళ్లారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజారులు అడిషనల్ కలెక్టర్‌కు అమ్మవారి వస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- 18 నుంచి వచ్చే నెల 2 వరకు ఎగ్జామ్స్
- భూపాలపల్లిలో 20 కేంద్రాలు.. 3,547 మంది విద్యార్థులు

జయశంకర్ భూపాలపల్లి, మార్చి 12 (నమస్తే తెలంగాణ) : పదో తరగతి పరీక్షలకు భూపాలపల్లి, ములుగు జిల్లాల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 2 వరకు జరగనున్న ఎగ్జామ్స్‌కు విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని 11 మండలాలకు చెందిన 3,547 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందుకోసం 20 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. భూపాలపల్లిలో నాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసి 862 మందిని కేటాయించారు. అలాగే కాటారంలో మూడు కేంద్రాల్లో 570, మహాముత్తారంలో ఒక కేంద్రంలో 159, మహాదేవపూర్‌లో రెండు కేంద్రాల్లో 387, మల్హార్‌లో ఒక కేంద్రంలో 173, గణపురంలో రెండు కేంద్రాల్లో 421, రేగొండలో రెండు కేంద్రాల్లో 183, చిట్యాలలో రెండు కేంద్రాల్లో 338, టేకుమట్లలో ఒక కేంద్రంలో 148, మొగుళ్లపల్లిలో రెండు కేంద్రాల్లో 296 మంది విద్యార్థులను కేటాయించారు. 20 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 20 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 20 మంది సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించారు. సుమారు 200 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వర్తించనుండగా, ముగ్గురు కీ సెంటర్ కస్టోడియన్లు, ఇద్దరు రూట్ ఆఫీసర్లు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు.

ములుగులో 21 కేంద్రాలు..

ములుగు, మార్చి12 (నమస్తే తెలంగాణ) : ములుగు జిల్లాలోని 9 మండలాల్లో ఏర్పాటు చేసిన 21 పరీక్షా కేంద్రాల్లో 3,092 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఇందులో 1,625 మంది బాలురు, 1,467 మంది బాలికలు ఉన్నారు. 21 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 21 డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 200 మంది ఇన్విజిలేటర్లతో పాటు రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను అధికారులు నియమించారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్స్, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించడం లేదు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రశ్న పత్రాలను తెరవడం దగ్గర నుంచి జవాబు పత్రాలు సీల్ చేయడం వరకు రికార్డ్ చేయనున్నారు. అలాగే కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండనుంది.

నేటి నుంచి గుట్టమీది ముసలయ్య జాతర

ములుగు రూరల్, మార్చి 12 : ములుగు మండలం రాయినిగూడెంలో బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు గుట్టమీది ముసలయ్య జాతర నిర్వహించనున్నట్లు పూజార్ల సంఘం అధ్యక్షుడు తవిటి నారాయణ, ఆలయ ప్రచార కార్యదర్శి గుండమీది వెంకటేశ్వర్లు మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు ముసలయ్య, నాగదేవతల విగ్రహాలు ప్రతిష్ఠించనున్నట్లు చెప్పారు. భక్తులు జాతరకు హాజరై ముసలయ్య ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

కొడవటంచ ఆలయ హుండీల లెక్కింపు

రేగొండ, మార్చి 12 : మండలంలోని కొడవటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీలను మంగళవారం లెక్కించారు. కాగా, మూడు నెలల కాలానికి రూ. 11, 58,011ఆదాయం సమకూరినట్లు ఆలయ చైర్మన్ ముల్కనూరి భిక్షపతి, ఈవో శ్రీనివాస్ తెలిపారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

భూపాలపల్లి రూరల్, మార్చి 12 : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ (ఎస్‌జీటీ) పోటీ పరీక్షకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డీ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12 స్టడీ సర్కిళ్లలో శిక్షణ పొందాలనుకుంటున్న అభ్యర్థులు ఈ నెల 22 లోపు www.tsbcstudy circle.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. 5 లక్షలలోపు ఉండాలని, ఇంటర్మీడియట్, డైట్, టెట్‌లో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం 0870-2571192, 040-24071178, 040-27077929 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలి

మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కన్నాయిగూడెం, మార్చి 12 : మండల విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం అధికారులతో తాగునీటి సమస్య రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ ఇలా త్రిపాఠి సమీక్ష నిర్వహించారు. ముందుగా చింతగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోషణ్ పక్షోత్సవానికి కలెక్టర్, అదనపు కలెక్టర్ పీ శ్రీజ హాజరయ్యారు. పలు విషయాలు అంగన్‌వాడీ టీచర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, ప్రీ స్కూల్ పిల్లలకు అంగన్‌వాడీల ద్వారానే సరైన పౌష్టికాహారం అందుతుందన్నారు. అనంతరం మండలస్థాయిలో జీపీల వారీగా ఇంటింటికీ ఉన్న మిషన్ భగీరథ నల్లాలు, తాగునీటి సౌకర్యాలపై కలెక్టర్ ఆరా తీశారు. మిషన్ భగీరథ పైప్‌లైన్‌లో సమస్య ఎదురైనప్పుడు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ఇంకా గ్రామాల్లో ఏమైనా నీటి వసతి కోసం అవసరం ఉంటే వెంటనే గుర్తించి ఈ నెల 15 వరకు అందజేయాలన్నారు. మార్చిలోపే పనులను పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీడబ్ల్యువో స్వర్ణలతా లెనినా, మండల ప్రత్యేక అధికారి ఏపీడీ వెంకటనారాయణ, ఎంపీపీ జనగాం సమ్మక్క, సీడీపీవో హేమలత, తహసీల్దార్ సలీం, ఎంపీడీవో అనిత, డాక్టర్ ఉషారాణి, ఎంపీవో రామకృష్ణ, నీటిపారుదల శాఖ డీఈ శరత్, విద్యుత్ ఏఈ స్వామి, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ ఇమ్మాన్యుయేల్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరందించాలి

గోవిందరావుపేట, మార్చి12 : వేసవి కాలంలో ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా ఇంటింటికీ సక్రమంగా నీరందించేలా చూడాలని మిషన్ భగీరథ ఉమ్మడి జిల్లా సీఈ శ్రీనివాస్‌రావు ఆదేశించారు. మండలంలోని చల్వాయి, గోవిందరావుపేట జీపీల్లో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని మంత్రి సీతక్క ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్యపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు సీఈ తెలిపారు. ఏదైనా సమస్య ఏర్పడితే సమీప బావులు, బోర్ల నుంచి ప్రజలకు తాగునీరందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో డీఈ హజారా, ఏఈ హారిక, పంచాయతీ కార్యదర్శి భారతి, మాజీ ఉప సర్పంచ్ తేళ్ల హరిప్రసాద్, జెట్టి సోమయ్య పాల్గొన్నారు.

అడ్మిషన్ల కోసం అధ్యాపకుల ప్రచారం

విద్యార్థులకు కరపత్రాలు అందిస్తున్న అధ్యాపకులు

ఏటూరునాగారం, మార్చి 12 : మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల కోసం అధ్యాపకులు ప్రచారం చేపట్టారు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులను మంగళవారం అధ్యాపకులు కలుసుకుని కరపత్రాల ద్వారా ప్రచారం చేపట్టారు. వాజేడు, మంగపేటలోని జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు డిగ్రీ కళాశాలలో ఉన్న వసతి , సౌకర్యాలను వివరించారు. కళాశాలలో మంచి ఫ్యాకల్టీ ఉందని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిన్న, అధ్యాపకులు విజయలక్ష్మి, బీ నవీన్, రమేశ్ కుమార్, సంపత్, తదిరులు పాల్గొన్నారు.

వారసత్వ సంపదను పరిరక్షించుకోవాలి

- దేశంలోనే పాండవుల గుట్టలు అద్భుతం
- భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా

హెరిటేజ్ వాక్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ భవేశ్‌మిశ్రా

రేగొండ, మార్చి 12 : ప్రాచీన వారసత్వ సంపదను పరిరక్షించుకోవాలని భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. పాండవుల గుట్టలు దేశంలోనే అద్భుత ప్రాంతంగా గుర్తింపబడ్డాయన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని తిరుమలగిరి శివారు పాండవుల గుట్టలో జియో హెరిటేజ్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హెరిటేజ్ వాక్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ జీఎస్ఐ దేశంలోని 90 అతి ప్రాచీన ప్రాంతాలను గుర్తించిందని, ఇందులో రాష్ట్రం నుంచి పాండవుల గుట్ట మాత్రమే ఎంపికైందన్నారు. పాండవులు ఈ ప్రాంతంలో నివాసం ఉన్నట్లు చరిత్ర చెపుతున్నదన్నారు. ఇక్కడి రాక్ పెయింటింగ్ అందరినీ ఆకట్టుకుంటున్నదన్నారు. రాబోయే రోజుల్లో విద్యార్థులు గొప్ప విజ్ఞానవంతులుగా, సైంటిస్టులుగా ఎదిగి రాష్ట్ర, దేశానికి సేవలందించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో వసంత, జీఎస్ఐ డైరెక్టర్ అనిల్, ఎంపీపీ పున్నం లక్ష్మి, ఎఫ్ఆర్వో నాగరాజు, ప్రసాద్‌రావు, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తగ్గుతున్న గోదావరి నీటిమట్టం

కన్నాయిగూడెం, మార్చి 12 : మండలంలోని తుపాకులగూడెం సమ్మక్క బరాజ్ వద్ద గోదావరి నీటిమట్టం రోజురోజుకూ తగ్గుతోంది. దీంతో నీటి పారుదల శాఖ అధికారులు ఎగువ నుంచి వస్తున్న 1,330 క్యూసెక్కుల వరదనీటిని బరాజ్ గేట్లను బంద్ చేసి నిల్వ చేస్తున్నారు. దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్ట్‌లోని మూడు మోటర్ల ద్వారా భీంఘనపురం రిజర్వాయర్‌లోకి రోజుకు 830 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. సమ్మక్క బరాజ్ వద్ద ప్రస్తుత నీటిమట్టం 74.75 మీటర్లుగా కొనసాగుతోంది.

అపరిచితులకు ఆశ్రయం కల్పించొద్దు : సీఐ

పలిమెల, మార్చి 12 : అపరిచితులకు ఆశ్రయం కల్పించొద్దని మహదేవపూర్ సీఐ రాజేశ్వర్‌రావు ప్రజలకు సూచించారు. మంగళవారం కమ్యూనిటీ కాంటాక్ట్‌లో భాగంగా మండలంలోని ముకునూరు పరిధి గొత్తికోయగూడెంను పోలీసులు సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. అనుమానితులు సంచరిస్తే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు.పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై తమాషారెడ్డి, సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏటూరునాగారం తహసీల్దార్‌గా జగదీశ్వర్

ఏటూరునాగారం, మార్చి 12 : ఏటూరునాగారం తహసీల్దార్‌గా జగదీశ్వర్‌ను నియమించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఖాజామెయినుద్దీన్‌ను భూపాలపల్లికి కొద్ది రోజుల క్రితం బదిలీ చేశారు. ఇంతకాలం కన్నాయిగూడెం తహసీల్దార్ సలీం ఇన్‌చార్జిగా పనిచేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి జగదీశ్వర్ ఏటూరునాగారం తహసీల్దార్‌గా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. జగదీశ్వర్‌ను ఓడ బలిజ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గార ఆనంద్, రాష్ట్ర కోశాధికారి గార పోశాలు శాలువా కప్పి సన్మానించారు.

ఎంఆర్ఐ బదిలీ

ఇక్కడ ఎంఆర్ఐగా పనిచేస్తున్న శ్రీనివాస్ మంగపేటకు బదిలీ అయ్యారు. వాజేడు ఎంఆర్ఐగా పనిచేస్తున్న కిరణ్‌ను ఏటూరునాగారం బదిలీపై వచ్చారు. ఈమేరకు శ్రీనివాస్ ఇక్కడ నుంచి రిలీవ్ కాగా కిరణ్ బాధ్యతలు స్వీకరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో వీరభద్రం

విద్యార్థులు సేవా భావాన్ని అలవర్చుకోవాలి

మహదేవపూర్, మార్చి 12 : విద్యార్థులు సేవా భావాన్ని అలవర్చుకోవాలని డీఎల్‌పీవో వీరభద్రం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వంగపల్లి పరశురాములు ఆధ్వర్యంలో మండలంలోని సూరారం గ్రామంలో వారం రోజుల పాటు నిర్వహించే ఎన్ఎస్ఎస్ గ్రామీణ సేవా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు మూఢ నమ్మకలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఎంపీవో ప్రసాద్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జీపీ రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

జీపీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని డీఎల్‌పీవో వీరభద్రం సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన సూరారంలోని జీపీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. వేసవిలో ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా జాగ్రత్తలు పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీవో ప్రసాద్, జీపీ కార్యదర్శి అంజలి, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు పరీక్షా ప్యాడ్ల పంపిణీ

పరీక్షా ప్యాడ్లతో విద్యార్థులు

మహదేవపూర్, మార్చి 12 : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం హెచ్ఎం పీ బుచ్చిరెడ్డి తన సొంత ఖర్చులతో 44 మంది విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిల్‌లు, స్కేల్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు 15 మంది ప్రముఖ శాస్త్రవేత్తల చిత్ర పటాలను పాఠశాలకు బహూకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆకుల ఆశోక్, ప్రభాకర్‌రెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాడిచర్ల పాఠశాలలో..

మల్హార్ : మండలంలోని తాడిచర్ల జడ్పీ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పెద్దపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రశాంత్ ఫిల్లింగ్ స్టేషన్ ప్రొప్రైటర్ వేల్పుల రమేశ్ సహకారంతో రూ. 12 వేల విలువైన పరీక్ష ప్యాడ్స్, పెన్నులు, స్కేల్స్ అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు లయన్ సాదుల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు మీసాల సత్యనారాయణ, మల్క రాంకిషన్ రావు, హెచ్ఎం మల్క భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బుద్దారంలో పల్లె ప్రగతి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో భాస్కర్

పల్లె ప్రగతి పనుల పరిశీలన

గణపురం, మార్చి 12 : మండలంలోని బుద్దారంలో జరుగుతున్న పల్లె ప్రగతి పనులను మంగళవారం ఎంపీడీవో ఎల్ భాస్కర్ పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీని సందర్శించి, అక్కడ రాళ్లలో పెరిగిన చెట్లను చూసి, వాటితో సర్వాంగ సుందరమైన వనాన్ని తయారు చేయాలని సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీలోని రిజిస్టర్లను పరిశీలించారు. ఆయన వెంట కార్యదర్శి హేమంత్, టైపిస్ట్ రమాకాంత్‌రెడ్డి, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరం

పోషణ పక్వాడ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

భూపాలపల్లి రూరల్, మార్చి 12 : తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్ వైజర్ మంగళపెల్లి సునీత అన్నారు. మంగళవారం భూపాలపల్లి మండలంలోని ఎస్ఎం కొత్తపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీసీపీయూ కౌన్సిలర్ శైలజతో కలిసి హాజరైన ఆమె మాట్లాడుతూ చిన్నారులకు ఆరు నెలల వరకు తల్లి పాలు తాగించాలని, అనంతరం అనుబంధ పోషకాహారం అందించాలన్నారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించి ఆడ పిల్లలను రక్షిస్తామని, చదివిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో చైల్డ్ లైన్ కేస్ వర్కర్ మండల ఇన్‌చార్జి కళావతి, అంగన్‌వాడీ టీచర్లు విలాస, రాణి, ఇందిర పాల్గొన్నారు.

పోషకాహారం అందించాలి

మహదేవపూర్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారాన్ని అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి సూచించారు. మంగళవారం మండలంలోని బొమ్మాపూర్, సూరారం గ్రామాల్లోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి అందుతున్న సేవలపై ఆరా తీశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తల్లులు, గర్భిణులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలి

మల్హార్ : మూడు నుంచి ఐదేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని సీడీపీవో రాధిక సూచించారు. పోషణ పక్వాడలో భాగంగా మంగళవారం మండలంలోని కొయ్యూర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కోడిగుడ్డుతోపాటు బాలామృతాన్ని పిల్లలకు తప్పని సరిగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సరస్వతి, కార్యదర్శి ప్రసాద్, అంగన్‌వాడీ టీచర్లు మాలిని, రజిత, ఆయా లక్ష్మి, గర్భిణులు, తల్లులు పాల్గొన్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

చిట్యాల, మార్చి 12 : అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పట్టుకుని తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రవణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సీఐ మల్లేశ్‌యాదవ్ ఆదేశాల మేరకు మండలంలోని వెంచరామి, అందుకుతండా గ్రామాల వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలలో ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను గుర్తించారు. కాగా, డ్రైవర్‌కం ఓనర్లైన అందుకుతండాకు చెందిన అజ్మీరా నందునాయక్, నేరేడుపల్లికి చెందిన మేకల స్టాలిన్, భీముని మహేందర్, దానవేన మహేందర్, బండి కిరణ్, జంగిటి కార్తీక్, వజినపల్లికి చెందిన తాళ్లపల్లి స్వామి, గట్టు శ్రావణ్, బండి విష్ణులపై కేసు నమోదు చేసి ఇసుక ట్రాక్టర్లను స్టేషన్కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. తనిఖీల్లో ఏఎస్సై ఈశ్వరయ్య, హెడ్ కానిస్టేబుల్ యాకయ్య, శ్రీధర్, నవీన్, అస్లాం, లింగన్న పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాల బారిన పడొద్దు

మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వరరావు

వాజేడు, మార్చి 12 : యువత మత్తు పదార్థాల బారిన పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఎస్సై చావళ్ల వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలోని మొరుమురు గ్రామంలో మంగళవారం గ్రామస్తులతో కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వహించారు. బాల్య వివాహాలు, చిన్న వయసులో ప్రేమ పేరుతో భవిష్యత్ పాడు చేసుకోవద్దని, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. గంజాయి, గుడుంబా, బెల్టం వంటి వాటిని సరఫరా చేసినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలోకి ఎవరైనా అపరిచితులు వస్తే సమాచారం అందించాలని సూచన చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్సైకమలాకర్ బాధ్యతల స్వీకరణ

గోవిందరావుపేట, మార్చి12 : మండలంలోని ఏప్రా ఎస్సైగా కమలాకర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కాగా, ఇక్కడ ఎస్సైగా పని చేసిన మస్తాన్ ములుగు డీసీఆర్బీకి బదిలీ కాగా ఆయన స్థానంలో కమలాకర్ ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా నేరుగా తమను కలవచ్చని ఎస్సై తెలిపారు.

మల్లారెడ్డి నియామకాన్ని రద్దు చేయాలి

ములుగు రూరల్, మార్చి12 : విద్యా శాఖలో క్వాలిటీ కోఆర్డినేటర్ మల్లారెడ్డి నియామకాన్ని రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ములుగు జిల్లా స్టీరింగ్ కమిటీ నాయకులు మంగళవారం డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ డీఈఓ పాణిని ఏకపక్ష నిర్ణయం తీసుకొని మల్లారెడ్డిని అక్రమంగా నియమించారని ఆరోపించారు. సీనియర్ హెచ్ఎంను క్వాలిటీ కోఆర్డినేటర్‌గా నియమించాలని డిమాండ్ చేశారు. స్టీరింగ్ కమిటీ నాయకులు వాసుదేవారెడ్డి, హట్కార్ సమ్మయ్య, ఆదిరెడ్డి, నరేంద్రకుమార్, నాగరాజు, సమ్మయ్య, వెంకటస్వామి పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై విచారణ చేపట్టాలి

వెంకటాపురం (నూగూరు) మార్చి 12 : మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో డీటీ మహేందర్‌కు ఆ గ్రామస్తులు వినతి పత్రం సమర్పించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసమని ఒక్కో ఇసుక లారీ నుంచి రూ.100 చొప్పున వసూలు చేసి జీపీ అభివృద్ధికి ఖర్చు పెట్టలేదని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ విషయంపై అధికారులు విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని కోరారు.

సదరం క్యాంపును వినియోగించుకోవాలి

ములుగు రూరల్, మార్చి12 : సదరం ధ్రువీకరణ పత్రం అందించేందుకు ములుగు ప్రభుత్వ దవాఖానలో ఏర్పాటు చేస్తున్న సదరం క్యాంపును దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ పీ జగదీశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19, 26న రెండు రోజుల పాటు నిర్వహించే సదరం క్యాంపుల కోసం మీ సేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకొని క్యాంపునకు హాజరు కావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు దవాఖానలో సంప్రదించాలని సూచించారు.

కుష్టు వ్యాధి నిర్ధారణ సర్వే పూర్తి చేయాలి

మహదేవపూర్, మార్చి 12 : కుష్టు వ్యాధి నిర్ధారణ సర్వేను ఈ నెల 24 వరకు పూర్తి చేయాలని మండలంలోని అంబట్‌పల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామారావు ఏఎన్ఎంలు, సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆశ డే కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామాల్లో చేపట్టే కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌వీ నిర్మల, హెల్త్ సూపర్‌వైజర్ మాషూక్ అలీ, హెల్త్ అసిస్టెంట్